సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 27 । ఆగస్టు । 2025

పచ్చని అరటి పిలకలు ఎంచక్కా స్వాగతిస్తుండగా.. రారమ్మని చెరుకుగడలు తీయగా
ఆహ్వానిస్తుండగా... జై గణేషా.. నినాదాలు మార్మోగుతుండగా.. ఆది దేవుడు
దివి నుంచి భువిపైకి అడుగుపెట్టాడు.. పళ్లెం నిండా ఉండ్రాళ్లు.. బుట్ట నిండా
వెలగపండ్లు కమ్మని ప్రసాదాలకు సిద్ధమవగా.. విఘ్న నాయకుడు
మండపాల్లో కొలువుదీరాడు.. వినాయకుడి రాకతో..
పల్లె ముంగిట.. పట్టణమింట.. సందడి నింగినంటింది.
ఊరూవాడా సంబరాల్లో మునిగిపోయింది.
కలతల అలజడులతో... ఆశల శ్వాసలతో..
బతుకుతున్న భక్తకోటి ..
బొజ్జ గణపయ్య ఎదుట ప్రణమిల్లడానికి సిద్ధమైంది.



జై గణేషా!

చవితి పూజలకు సర్వం సిద్ధం

- నేడు వినాయక చవితి
- జిల్లాలో 2500కు పైగా విగ్రహాల ప్రతిష్ఠ
- మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్న పలువురు భక్తులు
- పూజా సామగ్రి కొనుగోళ్లతో కిటకిటలాడిన నగర వీధులు

కడప సెవెన్‌రోడ్స్ : వినాయక చవితిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 9 గంటల నుంచే సందడి నెలకొంది. రోడ్లన్నీ గణపతిని తీసుకు వెళ్లే లారీలు, ట్రాక్టర్లు, ఉత్సాహం ఉరకలేస్తున్న యువకుల కేకలతో మార్మోగాయి. విగ్రహాలను విక్రయించే షెడ్ల వద్ద భక్తుల హడావుడి కనిపించింది.

రాజ భవనాలను తలపిస్తూ...

జిల్లాలో మొత్తం దాదాపు రెండున్నర వేలకు పైగా విగ్రహాలను పందిళ్లలో ప్రతిష్ఠించనున్నారు. ఒక్క కడప నగరంలోనే దాదాపు 470 వరకు విగ్రహాలు పూజలు అందుకునేందుకు సిద్ధమయ్యాయి. ఒక్కో విగ్రహానికి రూ. 20 వేల నుంచి రూ. 3 లక్షల దాకా వెచ్చించారు. కొన్నిచోట్ల వినాయకస్వామి పందిళ్లను భారీ సినిమా సెట్టింగులను తలపించేలా తీర్చిదిద్దారు. నగరంలోని ఒక్కో పందిరికి లక్షలు ఖర్చు చేసినట్లు సమాచారం. రాజీవ్‌మార్గ్‌లోని పార్కు ఎదుట విశాలమైన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రాజభవనాన్ని తలపిస్తోంది. ఇక ఎన్జీఓ కాలనీలోని పందిరి ఎప్పటిలాగే తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటోంది. చిన్నచౌకు ఆంజనేయస్వామి ఆలయం వద్ద గల పందిరి కూడా రాజభవనాన్ని తలపిస్తూ ఆకర్శిస్తోంది.

సందడే సందడి

జిల్లా అంతటా పండుగ సందడి కనిపించింది. నగరంలో చిన్ని



విగ్రహం తీసుకెళ్తున్న ఉత్సవ కమిటీ వారు

మట్టి వినాయక విగ్రహాలు 50 నుంచి 100 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. పండుగను పురస్కరించుకుని ప్రజలు పూజా సామగ్రి కొనుగోలు చేస్తుండడంతో వీధులన్నీ కిటకిటలాడుతున్నాయ. గణపతి పూజ కోసం ఉపయోగించే చెండుమల్లి, చేమంతి, రోజా పూజల ధరలు ఆకాశాన్ని అంటాయి. మామిడి ఆకులు రూ.20, రెండు అరటి పిలకలు రూ. 50, గరిక రూ. 20, జత వెలక్కాయలు రూ. 50, చిన్న చెరకు ముక్క రూ. 20, ఒక చెరుకు గడ రూ.100, మొక్కజొన్న కంకులు జత రూ. 40కి విక్రయించారు.



పూలు కొనుగోలు చేస్తున్న భక్తులు

గణపతి విగ్రహాలు ఉచిత పంపిణీ

నగరంలోని పలువురు భక్తులు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు మట్టి గణపతి ప్రతిమలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఐస్‌క్రీమ్ రవి, వికాస్ కళాశాల కరస్పాండెంట్ సుల్తాన్‌బాబా, పోతుల ట్రావెల్స్ అధినేత వెంకట్రామిరెడ్డితోపాటు పలువురు భక్తులకు మట్టి విగ్రహాల పంపిణీ చేశారు.



పూజ సామగ్రి తీసుకెళ్తున్న మహిళలు

మట్టి గణపతిని పూజిస్తేనే వ్రత ఫలితం



మట్టి గణపతిని పూజించిన వారు మాత్రమే వినాయక చవితి వ్రత ఫలితాన్ని పొందగలరని హిందూ ధర్మశాస్త్ర గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. ధర్మశాస్త్రాల్లో చెప్పిన ప్రకారం గణపతి ప్రతిమలను మట్టితో ఆరాధించి వ్రత ఫలితాన్ని పొందాలని ఆకాంక్షిస్తున్నాం.
– కేహెచ్ విజయబట్టర్, అర్చక పురోహిత సమాఖ్య జిల్లా అధ్యక్షులు, కడప

సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి



వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి. వినాయక మండపాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు మాత్రమే నిర్వహించాలి. డీజే సౌండ్ సిస్టమ్ ద్వారా అనారోగ్య బాధితులకు ఇబ్బందులు కలిగించరాదు.
– దేసు వెంకటరెడ్డి, ధర్మకర్త, శ్రీ కోదండ రామాలయం, హౌసింగ్‌బోర్డు కాలనీ, కడప

ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి..



చవితి పండుగను హిందూ సోదరులు ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలి. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే వినియోగించుకుని పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేయాలి. అందరికీ పర్వదిన శుభాకాంక్షలు.
– ఎస్.సుల్తాన్‌బాబా, కరస్పాండెంట్, వికాస్ విద్యా సంస్థలు, కడప

పర్యావరణ హితం కోరే....



తొలి నుంచి సంక్రాంతి, రంజాన్ పర్వదినాల సందర్భంగా కానుకలు పంపిణీ చేసేవాణ్ణి. ఆపై మిత్రుల సలహామేరకు వినాయక చవితి సందర్భాన్ని పురస్కరించుకుని 12 ఏళ్లుగా మట్టి విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేస్తున్నాను.
– రవీంద్రారెడ్డి (ఐస్ క్రీమ్ రవి), వినాయక మండప నిర్వాహకులు, నాగరాజుపేట, కడప

మట్టి వినాయకుడి.. చిట్టి సందేశం!

కడప సెవెన్‌రోడ్స్ : హలో....నేను మీ మట్టి గణపతిని... అదేనండీ.. మీరు ప్రేమగా పిలుచుకునే బొజ్జ గణపతిని. గతేడాది చవితి వేడుకలకు వచ్చి.. ఇక్కడే ఉండిపోయాను. పెద్ద పెద్ద బొమ్మల్లా కాకుండా ఇలా 'చిన్ని మట్టి గణపతి' రూపంలో ఇక్కడ నిలబడ్డాను. అదేంటోగానీ, ఈ జనాలందరూ పెద్ద పెద్ద వినాయక రూపాలను పూజించి ఆనందపడుతుంటారు. 'మట్టి విగ్రహం' రూపంలో వచ్చినందునే నేను అమ్ముడుపోని వినాయకుడిగా మిగిలిపోయాను. ఈ చవితికైనా నన్ను ఎవరో ఒకరు కొనక పోరా..! పూజలు చేయక పోరా! అని ఎదురు చూస్తున్నాను. నన్ను అమ్మేవాడు మరింత మెరుగులు దిద్ది బండిపైన ఏడురోడ్ల వద్ద నిలబెట్టాడు.

అదిగో మాటల్లోనే.. నా రూపంలోనే ఎంత పెద్ద విగ్రహమో... వస్తుంటే పెద్ద కొండ నడుస్తున్నట్లే ఉంది. రంగులు, అవీ చూస్తే చూడముచ్చటగానే ఉంది. అయినా అదంతా రసాయనాలమయం... హానికరమని చెబితే ఎవరు వింటున్నారు.. ఇందువల్ల నిమజ్జనమయ్యాక చెరువులు, సరస్సులు, జలాశయాలు కలుషితమైపోయని చెబుతుంటే ఎవరు పట్టించుకుంటున్నారు.. నన్ను చూస్తున్నప్పుడు మీ కళ్లల్లో సంతోషాన్ని చూడాలని.. పూజల వేళ సుమధుర మంత్రాలు వినాలని ఆశపడ్డాను.. ఏదీ ఎవరూ వినరే.. కనీసం భక్తి పాటలతోనైనా వీనుల విందు చేస్తారా అంటే అదీ లేదు.. భారీ బాణ సంచాలతో నా చెవులే చిల్లులు పడేలా ఉన్నాయి. ఆ డీజేలతో నా గుండెలే అదిరేలా ఉన్నాయి.. సరేలే.. తొందరగా ఈ చవితికైనా పూజలందుకుని, కైలాసానికి వెళ్లిపోవాలనుకుంటే.. నా వంతు మాత్రం ఇంకా రాలేదు.

మీ అందరికీ మరో ముఖ్యం విషయం .. మీరు కొనే ఎత్తయిన విగ్రహాన్ని నేను చూడను... రంగురంగుల ఆహార్యాన్ని అస్సలు పట్టించుకోను... కల్మషం లేని.. కలుషితం చేయని మనసుల్ని.. మనుషుల్నే చూస్తాను.. అయినా రూపంలో.. రంగుల్లో ఏముంది.. పేద..ధనిక భేదాలు చూపకండి.. కుల,మత పట్టింపుల్లేకుండా సోదర భావంతో మెలగండి.ఐకమత్యంగా ఉండండి..అయినా నేను లేని చోటు లేదని మీకు తెలీదా..

ఇదిగో మాటల్లోనే.. ఓ పిల్లాడు సంబరంగా ఇటు వైపే వస్తున్నాడు...'అంకుల్ నాకు ఈ గణపయ్య బొమ్మ కావాలి...ఎంత అవుతుంది? . రూ. 150 అవుతుంది, నీకైతే రూ. 100కు ఇస్తా .నా వద్ద రూ. 50లే ఉన్నాయి.. చిన్నబోయిన ముఖంతో.. సరేలే .. తీసుకెళ్లు..

'పిల్లాడు గెంతులేస్తూ నన్ను తీసుకెళ్లి వాళ్ల ఇంటిముందు నిలబడ్డాడు. మన వీధిలో పెద్ద వినాయకుడు ఉండగా...ఈ బొమ్మ ఎందుకు తీసుకొచ్చావంటూ వాళ్ల నాన్న కొద్దిసేపు గోల చేసినా, వాళ్లమ్మ నన్ను తీసుకెళ్లి ఇంట్లో ఉంచింది. ఈ చవితి పూజలు చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. పిల్లాడికి నేను మనసారా ఆశీస్సులు అందజేశాను. మరి మీరు కూడా మట్టి వినాయకుడినే పూజిస్తారు కదూ.. అందరికీ విజయోస్తు..

● శుభాకాంక్షలు



జిల్లా ప్రజలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. వినాయక చవితి పండుగను జిల్లా ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

● గణేష్ ఆకారంలో..



కమలాపురం మండలంలోని కొండాయపల్లె వద్ద ఉన్న శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు వినాయకుని ఆకారంలో కూర్చుని సందడి చేశారు. మంగళవారం ఆ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాఠశాల క్రీడా మైదానంలో ఇదిగో ఇలా వినాయకుని ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు.

● మట్టి గణపతి



పర్యావరణ రక్షణకు మట్టిగణపతిని పూజించాలని కలెక్టర్ ప్రజలను కోరారు. పర్యావరణ కాలుష్య నియంత్రమండలి ఆధ్వర్యంలో ఉచిత మట్టి ప్రతిమలను ఆయన పంపిణీ చేశారు.

ఉపాధి వనరుల ఖిల్లా 'కొప్పర్తి'

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో ఉపాధి వనరుల ఖిల్లాగా కొప్పర్తి ఏపీఐఐసీ మెగా ఇండస్ట్రియల్ హబ్ వెలుగొందుతోందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. మంగళవారం కొప్పర్తిలోని ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌ను కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తోకలిసి కలెక్టర్ పరిశీలించారు. సెప్టెంబర్ 2న విద్యా, ఐటీ శాఖామంత్రి నారా లోకేష్ జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కులో నూతనంగా నిర్మించిన ఎగ్జిక్యూటివ్ గెస్ట్ హౌస్‌తో పాలు పలు పరిశ్రమలను మంత్రిచే ప్రారంభోత్సవం చేయించే యోచనలో జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగా అధునాతన సదుపాయాలతో నిర్మితమైన ఎగ్జిక్యూటివ్ గెస్ట్ హౌస తోపాటు ఆయా పరిశ్రమల యూనిట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. అంతేకాకుండా అక్కడ అవసరమైన భద్రతా ఏర్పాట్లపై ఎస్పీతో చర్చించారు. ఆర్డీవో జాన్ ఇర్విన్, ఏపీ ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాస మూర్తి, ఇండస్ట్రిస్ జీఎం చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

29న స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం

కడప ఎడ్యుకేషన్ : ఆగష్టు 29 నేషనల్ స్పోర్ట్స్ డేను పురస్కరించుకుని స్కూల్ స్పోర్ట్స్ ఎక్సలెంట్ అవార్డుకు జిల్లాలో ఐదు పాఠశాలలను ఎంపిక చేసినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఇందులో కడప ఎంసీహెచ్ఎస్ మెయిన్ , మైదుకూరు జెడ్పీ బాయ్స్ హైస్కూల్, ఎర్రగుంట్ల జెడ్పీ బాయ్స్ హైస్కూల్, దువ్వూరులోని జెడ్పీ హైస్కూల్(మాచనపల్లి), వేములలోని జెడ్పీ హైస్కూల్(కొత్తపల్లి) ఉన్నాయి.

క్లుప్తంగా

రేపు ఆర్ట్స్ కళాశాలలో అంతర్జాతీయ సమావేశం

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ పురుషుల కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన సమగ్ర జీవశాస్త్రం, ఔషధ శాస్త్రంలో జరిగే పరిశోధనల గురించి అంతర్జాతీయ సమావేశం నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సమావేశానికి దేశ విదేశాల నుంచి శాస్త్రవేత్తలు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి దాదాపు 200 పైగా పరిశోధక వ్యాసాలను పరిశోధకులు సమర్పిస్తారని కన్వీనర్, జంతుశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ వీర నాగేంద్ర కుమార్ తెలిపారు.

29 వరకు బార్లకు దరఖాస్తుల గడువు పెంపు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో 27 బార్లకు దరఖాస్తుల గడువు ఈ నెల 29 వరకు పొడిగించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 27 బార్లకు ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 26న చివరి తేదీగా గడువు నిర్ణయించామన్నారు. అయితే వినాయక చవితి, 23న బ్యాంకు సెలవు, వరదలు, వర్షాల కారణంగా అనేకమంది దరఖాస్తులను సమర్పించలేక పోయారన్నారు. దీంతో దరఖాస్తుల గడువు సమయాన్ని పొడిగించామన్నారు. 30న ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో లాటరీ తీస్తామన్నారు.

అవసరం మేరకే రసాయనిక ఎరువుల వినియోగం

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం వ్యవసాయశాఖతో పాటు విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ జేడీ చంద్రనాయక్ మాట్లాడుతూ ఎరువుల డీలర్లు అధిక ధరలకు ఎరువులు అమ్మినట్లు రుజువు అయితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతానికి చింతకొమ్మదిన్నె మండలంలో ప్రైవేటు డీలర్ల వద్ద 50 మెట్రిక్ టన్నులు యూరియా ఉందని, ప్రస్తుతానికి ఎలాంటి కొరత రాలేదని తెలిపారు. అలాగే రైతులు కూడా రసాయనిక ఎరువులను అవసరం మేరకే వినియోగించాలని అధికంగా యూరియా పంటలకు వేసినట్లయితే చీడ పీడల అభివృద్ధి పెరుగుతుందన్నారు.

టీడీపీలో భగ్గుమన్న వర్గ విభేదాలు

- భూ వివాదంపై టీడీపీ మండల అధ్యక్షుడిపై దాడి
- పోలీసు స్టేషన పక్కనే పరస్పరం రాళ్లు రువ్వుకున్న టీడీపీ నాయకులు
- ప్రేక్షక ప్రాత వహించిన పోలీసులు


పెండ్లిమర్రిలో పోలీసు స్టేషన్ పక్కనే రాళ్లు రువ్వుకుంటున్న టీడీపీ నాయకులు

పెండ్లిమర్రి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో వాటాల కోసం.. భూ ఆక్రమణల కోసం నిత్యం కుమ్ములాటలు ఎక్కువయ్యాయి. ముఖ్యంగా తెలుగు తమ్ముళ్ల మధ్యే వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. తాజాగా పెండ్లిమర్రి మండంలో వాటాల కోసం పోలీసుల ముందే ఇరువర్గాలు గొడవలకు దిగన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పెండ్లిమర్రి మండల టీడీపీలో మంగళవారం వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. భూ వివాదంలో జోక్యం చేసుకున్నాడని టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డిపై అదే పార్టీకి చెందిన టీడీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, సాంబశివారెడ్డి, శివారెడ్డి దాడి చేశారు. దాడిలో గంగిరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. పెండ్లిమర్రి గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డికి కోరవాండ్లపల్లె బీసీ కాలనికి చెందిన యాదవులకు గత కొంత కాలం నుంచి భూవివాదం నడుస్తోంది. ఈ వివాదంలో టీడీపీ మండల అధ్యక్షుడు జోక్యం చేసుకుటున్నాడని అతనిపై దాడికి దిగారు. కొద్దిసేపటికి ఇరు వర్గాల వారు అనుచరులను పిలుపించుకొని పోలీసు స్టేషన్ పక్కనే రాళ్లు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడుల్లో ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. పోలీస్ స్టేషన్ సమీపంలోనే ఇరువర్గాలు దాడులు చేసుకుంటున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ మిన్నకుండిపోయారు. గొడవ పూర్తిగా ముగిసిన తర్వాత పోలీసు బలగాలను పిలిపించి మమ అనిపించారు.

ఇద్దరు ఘరానా దొంగల అరెస్టు

383 గ్రాముల బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప అర్బన్ : ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు ఘరానా దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 383 గ్రాముల బంగారు, వెండి ఆభరణాలు, 30 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కడప రవీంద్ర నగర్‌కు చెందిన సయ్యద్ ఇర్ఫాన్, కడప నగరం బాచరావు వీధికి చెందిన షేక్ ఇబ్రహీం ఖలీలుల్లా గతంలో సిద్దవటం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ చోరీ కేసులో నిందితులుగా ఉన్నారని తెలిపారు. చోరీలకు పాల్పడిన నాలుగు ఘటనల్లో నిందితులు నేరాన్ని అంగీకరించారని తెలిపారు. చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్జీఓ కాలనీలో ఒక ఇంటిలో ఇద్దరూ కలిసి దొంగతనానికి పాల్పడగా, సయ్యద్ ఇర్ఫాన్ రవీంద్రనగర్, మురాదియానగర్ ప్రాంతాల్లోని రెండు ఇళ్లలో బంగారు, వెండి వస్తువులను దొంగిలించినట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 43 గ్రాముల బరువు గల బంగారు ఆభరణాలు, 340 గ్రాముల బరువు గల వెండి వస్తువులు, రూ. 30,000 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. మంగళవారం తాడిపత్రి–తిరుపతి బైపాస్ రోడ్డులోని నానాపల్లి క్రాస్ రోడ్డులో సయ్యద్ ఇర్ఫాన్, షేక్ ఇబ్రహీమ్ ఖలీలుల్లాను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన చిన్నచౌక్ ఇన్‌స్పెక్టర్ ఓబులేసు, ఎస్ఐలు రాజరాజేశ్వరరెడ్డి, రవికుమార్, హెడ్ కానిస్టేబుళ్లు వేణుగోపాల్, శివకుమార్, కానిస్టేబుళ్లు ఖాదర్ హుస్సేన్, ప్రదీప్ కుమార్, ఓబులేసు, సుధాకర్ యాదవ్, మాధవ రెడ్డి, రంతుబాషాలకు రివార్డుల కోసం సిఫార్సు చేస్తున్నామని తెలిపారు.

బాకీ చెల్లించలేదని దళిత యువకుడి హత్య


అపస్మారక స్థితిలో పాలగిరి చెన్నయ్య

దువ్వూరు : బాకీ చెల్లించలేదని దళిత యువకుడిని హత్య చేసిన ఘటన దువ్వూరు మండలం మదిరేపల్లె గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు మదిరేపల్లె గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన పాలగిరి చెన్నయ్య (29) అదే గ్రామానికి చెందిన అమ్మిరెడ్డి సంజీవరెడ్డి అనే వ్యక్తి వద్ద పనులకు వెళ్లేవాడు. ఈ క్రమంలో అవసర నిమిత్తమై డబ్బు అప్పుగా తీసుకుని చెల్లించేవాడు. మూడు నెలల క్రితం సంజీవరెడ్డి నుంచి చెన్నయ్య రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. రెండు నెలల క్రితం తనకు అవసరం ఉందని డబ్బు ఇవ్వాలని సంజీవరెడ్డి అడుగగా తన వద్ద ఇప్పుడు డబ్బు లేదని చెప్పడంతో చెన్నయ్య, సంజీవరెడ్డి గొడవపడ్డారు. ఈ క్రమంలో ఈనెల 24న సాయంత్రం 4 గంటల సమయంలో చెన్నయ్య ఇంటి దగ్గరికి సంజీవరెడ్డి వచ్చి గుడిపాడు గ్రామంలో పని ఉంది పోయి వద్దాం రా అని పిలుచుకుని వెళ్లాడు. అదే రోజు రాత్రి చిన్నసింగనపల్లె – మనేరాంపల్లె మధ్యలో నారుపల్లె మోహన్ రెడ్డి తోట వద్ద చెన్నయ్యపై సంజీవరెడ్డి విచక్షణా రహితంగా దాడిచేసి మోటార్ బైక్‌తో తొక్కించాడు. రాత్రి 9 గంటల సమయంలో చెన్నయ్య చిన్నాన్న కొడుకు పాలగిరి యోనాకు సంజీవరెడ్డి ఫోన్ చేసి మీ వాన్ని కొట్టిపడేసినా.. ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పాడు. చెన్నయ్య బంధువులు సంఘటన స్థలానికి వెళ్లగా అప్పటికే తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో చెన్నయ్య పడి ఉన్నాడు. వెంటనే వారు ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తీసుకెళ్లాలని సూచించడంతో అక్కడి తీసుకెళ్లారు. రిమ్స్ నుంచి కర్నూలు తీసుకెళ్లగా అక్కడ పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో చెన్నయ్య పలకకపోవడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సోమవారం రాత్రి 11 గంటలకు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు పరీక్షించి చెన్నయ్య మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతునికి భార్య శిరీష, ఇద్దరు కుమార్తెలు మహిమరాణి, మేఘన ఉన్నారు. విషయం తెలుసుకున్న మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చెన్నయ్య మృతదేహాన్ని పరిశీలించి, మండలంలోని మదిరేపల్లె గ్రామానికి వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించి గ్రామస్తులను విచారించారు. ఈ సంఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి, హత్య కేసు నమోదు చేశామని, నిందితుడు సంజీవరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు దువ్వూరు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. కుటుంబాన్ని పోషించే కొడుకు హత్యకు గురికావడంతో చెన్నయ్య తల్లిదండ్రులు, భార్యా, పిల్లలు కన్నీరుమున్నీరయ్యారు. నిందితుడిని కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని వారు కోరారు.

నకిలీ అకౌంట్‌లను నమ్మకండి

జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : సామాజిక మాధ్యమాల్లో నకిలీ అకౌంట్‌లను ప్రజలు నమ్మకూడదని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరో తెలియని ఒకరు తన పేరుతో ఫేక్ అకౌంట్స్ క్రియేట్ చేసినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆ ఖాతా తనది కాదని స్పష్టం చేశారు. తన ఫొటోలు వాడి ఇతరులను మోసం చేసేందుకు ప్రయత్నించే వారిపై చర్యలు తీసుకుంటామని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పదంగా ఫేక్ ఐడీతో మెసేజ్‌లు, రిక్వెస్ట్‌లు వస్తే ఆమోదించకూడదన్నారు. తన పేరుతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఐడీలు సృష్టించి మెసేజ్‌లు చేస్తే స్పందించకూడదన్నారు. ఇలాంటి ఫేక్ హ్యాకర్‌లపై చర్యలకు కేసు నమోదు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపిక


అధ్యాపకుడు ప్రభాకర్

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడు డాక్టర్ విరూపాక్షి ప్రభాకర్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా తెలిపారు. గుంటూరులోని సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్, కె.వి.ఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి (టీచర్స్ డే) సందర్భంగా జాతీయ ప్రతిభా పురస్కారాలు ప్రకటించనున్నారు. ఈనెల 31వ తేదీన ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడు, కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రభాకర్ గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డును అందుకోనున్నారు. జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపిక కావడం పట్ల డైరెక్టర్‌తో పాటు, పరిపాలన అధికారి రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

బైకు అదుపు తప్పి ఒకరి మృతి


నాయబ్ రసూల్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మహమ్మద్‌రఫీ, ఎస్ఐ సుబ్బరామచంద్ర


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హర్షవర్ధన్

మరొకరికి గాయాలు

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లి గ్రామ సమీపంలోని కామాక్షమ్మ గుడి వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బద్వేల్‌కు చెందిన షేక్ నాయబ్‌రసూల్(22), పి.హర్షవర్ధన్ అనే యువకులు కడప నుంచి మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనంలో బద్వేల్‌కు బయలుదేరారు. వారు అతివేగంగా ప్రయాణిస్తూ కంట్రోల్ చేసుకోలేక సిద్దవటం మండలం కనుమలోపల్లి గ్రామ సమీపంలోని కామాక్షమ్మ గుడి వద్ద రోడ్డు పక్కన ఉన్న సూచిక బోర్డును ఢీకొని రోడ్డు పక్క చెట్లలో ఎగిరిపడ్డారు. ఈ ప్రమాదంలో బద్వేల్‌లోని మహబూబ్‌నగర్‌కు చెందిన షేక్ నాయబ్‌రసూల్ తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనక కూర్చున్న బద్వేల్‌లోని మహబూబ్‌నగర్‌కు చెందిన పి.హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతన్ని వైద్యం కోసం పోలీసులు 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, నాయబ్ రసూల్ మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



శివకుమార్, రామాంజనేయులు మృతదేహాలు

కొండాపురం : మండల పరిధిలోని లావనూరు సమీపంలో సాయిబాబాగుడి దగ్గర మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాంజనేయులు(24), శివకుమార్ (27) దుర్మరణం చెందారు. వీరు బైకుపై వస్తుండగా స్కార్పియో వాహనం ఢీకొన్నట్లు కొండాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా యల్లనూరు మండలంలోని దుగ్గుపల్లె వద్ద పంప్ హౌస్‌లో నాలుగురోజుల నుంచి అక్కడ పని చేసి తిరిగి కొండాపురానికి బైకుపై వస్తుండగా లావనూరు వద్ద స్కార్పియో వాహనం ఢీ కొంది. రామంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. శివకుమార్‌ను 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతులు అనంతపురం జిల్లా పెనుగొండకు చెందినవారని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

జిల్లాలో సీఐల బదిలీలు

కడప అర్బన్ : వైఎస్‌ఆర్ కడప జిల్లాలో వివిధ సర్కిళ్ల పరిధిలో పని చేస్తున్న సీఐలను మంగళవారం బదిలీ చేస్తూ కర్నూల్ రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. వారి వివరాలు ఇలా ఉన్నాయి.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
ఎం. తిమ్మారెడ్డి	డీఎస్‌బీ అన్నమయ్య	ప్రొద్దుటూరు వన్ టౌన్ యూపీఎస్
బి.రామకృష్ణారెడ్డి	ప్రొద్దుటూరు వన్ టౌన్ యూపీఎస్	రిమ్స్ యూపీఎస్ కడప
వి.సీతారామిరెడ్డి	కడప రిమ్స్ యూపీఎస్	పులివెందుల యూపీఎస్
ఎస్.చాంద్ బాషా	పులివెందుల యూపీఎస్	సోషల్ మీడియా సైబర్, నంద్యాల
ఎస్.వంశీధర్	సోషల్ మీడియా సైబర్ క్రైమ్ నంద్యాల	ఖాజీపేట యూపీఎస్
ఆర్.మోహన్	ఖాజీపేట యూపీఎస్	వీఆర్ కడప
ఎం.నాగభూషణ్	సీకే దిన్నె	ప్రొద్దుటూరు రూరల్ సర్కిల్
బి. బాల మద్దిలేటి	ప్రొద్దుటూరు రూరల్ సర్కిల్	సీకే దిన్నె యూపీఎస్

రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో రాణించిన సునంద


అతిథుల చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంటున్న సునంద

కమలాపురం : కమలాపురం మండలం నల్లలింగాయపల్లెలోని భారతి సిమెంట్స్ కాలనీకి చెందిన చౌడం సునంద రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం అందుకున్నారు. ఈ నెల 21 నుంచి 25 వరకు తాడేపల్లి గూడెం సరస్వతి విద్యాలయం ప్రత్తిపాడులో జరిగిన 6వ రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ 2025 పోటీల్లో పాల్గొన్న సునంద 35–40 ఏజ్ గ్రూప్‌లోని ట్రెడిషనల్ ఆసనాల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం అందుకున్నారు. అలాగే ట్విస్టింగ్ ఆసనాల పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించారు. కాగా సెప్టెంబర్ నెలలో ఛత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయ స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొననున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సునందను పలువురు భారతి పరిశ్రమ ప్రతినిధులు, ఉద్యోగులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఎంపిక

వేంపల్లె : రాష్ట్ర స్థాయిలో జరిగే యోగా పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపికైనట్లు ఆర్కేవ్యాలీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా తెలిపారు. వేంపల్లెలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కడప జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో తమ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు 6 బంగారు, 5 వెండి, 5 రాగి పతకాలతోపాటు 4 మెరిట్ స్థానాలు సాధించడం విశేషమన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు 'భారతి' విద్యార్థి ఎంపిక


వైశాలిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ కిషోర్ కుమార్

కమలాపురం : రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు డీఏవీ భారతి స్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థిని పి.వైశాలి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శివ్వం కిషోర్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 24వ తేదీన రాజంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న వైశాలి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు ప్రకాశం జిల్లా చేవూరులో జరిగే రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ విభాగం పోటీల్లో ఆ విద్యార్థిని పాల్గొంటుందన్నారు. భారతి సిమెంట్స్ సీఎంఓ సాయి రమేష్, హెచ్ఆర్ గోపాల్‌రెడ్డి, ఐఆర్ అండ్ పీఆర్ చీఫ్ భార్గవ్ రెడ్డి, డీఏవీ ప్రాంతీయ అధికారి శేషాద్రి తదితరులు వైశాలితో పాటు పీడీ రామచంద్రను అభినందించారు.

బ్రహ్మంసాగర్‌లో పడి మహిళ మృతి


బ్రహ్మంసాగర్‌లో మృతి చెందిన మడక లక్ష్మీదేవి

బ్రహ్మంగారిమఠం: మండల పరిధిలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీ నరసన్నపల్లి గ్రామానికి చెందిన మడక లక్ష్మీదేవి(39) అనే మహిళ మంగళవారం బ్రహ్మంసాగర్‌లో గల్లంతై మృతి చెందింది. బాధితులు, కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల లక్ష్మీదేవి కూతురు అకస్మాత్తుగా మృతి చెందింది. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతున్న లక్ష్మీదేవి తన కుమారుడు స్వరూప్‌ను వెంటబెట్టుకుని మంగళవారం తెల్లవారుజామున బ్రహ్మంగారి దర్శనం కోసం ఊరి నుంచి వెళ్లింది. ఈ క్రమంలో బ్రహ్మంగారిమఠం సమీపంలోని బ్రహ్మంసాగర్‌లో స్నానం చేస్తుండగా గల్లంతైంది. తన కుమారుడి ద్వారా ఈ విషయం విషయం తెలుసుకున్న గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని లక్ష్మీదేవి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతురాలి భర్త మడక రమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

భూ వివాదాలపై కలెక్టర్ ఆరా


పొట్లదుర్తి పెద్దమ్మ తల్లి మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మండలం పొట్లదుర్తి గ్రామంలో ఉన్న పెద్దమ్మతల్లి భూములకు సంబంధించిన వివాదంపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఆరా తీశారు. మంగళవారం ఎస్పీ అశోక్‌కుమార్, ఆర్డీఓ సాయిశ్రీ, ఎండోమెంట్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లికి సంబంధించిన భూముల రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పొట్లదుర్తిలోని పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని అవసరమైతే ప్రత్యేక నిధులు కూడా కేటాయించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కల్లమల్ల గ్రామంలో పాత కలమల్ల , కొత్త కలమల్ల గ్రామాలకు సంబంధించిన సిద్దేశ్వర స్వామి ఆలయ భూముల వివాదంపై స్థానిక ప్రజలతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ రెండు గ్రామాల మధ్య ఉన్న భూ వివాదంలో తాము ఎలాంటి జోక్యం చేసుకోమని అధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారో దానికి అందరూ కట్టుబడి ఉండాలని సూచించారు.

నూతన ఆర్థిక, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ల నియామకం


జి.రమేష్


వై.అరుణ్‌కుమార్‌రెడ్డి

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో నూతన ఆర్థిక అధికారిగా ఎంఎంఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ జి.రమేష్‌ను ఆర్జీయూకేటీ అధికారులు నియమించారు. ఈయన గతంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డీన్ అకడమిక్, స్టోరేజ్ అండ్ పర్చేస్ కోఆర్డినేటర్ ఎంఎంఈ విభాగంలో హెచ్‌ఓడీగా పనిచేశారు. అలాగే నూతన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా డాక్టర్ వై.అరుణ్ కుమార్ రెడ్డిని నియమించారు. ఈయన గతంలో ఎంఎంఈ విభాగం హెచ్‌ఓడీ, అసోసియేట్ డీన్ ఆఫ్ అకాడమిక్‌గా విధులు నిర్వహించారు. వీరు మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి రవికుమార్, డీన్ ఆఫ్ అకాడమిక్ రమేష్ కైలాష్ , అధ్యాపకులు అభినందించారు.